# దేశీయ పరిశ్రమ

గిర్ధర్‌భాయి దగ్గిర పాతికలక్షల కంటె జాస్తి డబ్బులేదు. ఎట్లా ఉంటుందీ? ముప్ఫై లక్షలు బర్మాలో ఇరుక్కుపోయింది. ఆ విచారం పట్టలేక నాలుగు లక్షలుపెట్టి బొంబాయిలో అయిదారంతస్తుల మేడలు కొనేశాడు. కాని ఇప్పుడు గిర్ధర్‌భాయికి కొంచెం తెలివొచ్చినట్టయింది. అందుచేత ఆ ఉన్న తృణమో కణమో పెట్టుబడి చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాడు.

ఏదన్నా వ్యాపారం చెప్పు, భాయ్, మా హిమ్మత్ భాయ్ రెండునెల్లకిందటనే అమెరికాకు మూడువేల టన్నుల కరక్కాయ ఎగుమతిచేసి కాలిమీద కాలేసుక్కూచున్నాడు. నేనే వొట్టి చవటనై పోయినాను!... పాతిక లక్షలు – వృథాగా బాంకులో మూలుగుతున్నై!...

గిర్ధర్‌భాయిని చూస్తే నాకు జాలేసింది. మనబోటి తెలీని వాళ్లం డబ్బేమిటో సుఖమనుకుంటాం గాని, వొట్టిది. మా వాడికి నిద్రాహారాలు లేవు. అన్నానికి కూర్చుంటే పాతిక లక్షలూ బాంకులోనించి మూలగటం వినపడుతుంది; నిద్రపోదామంటే వినిపిస్తుంది. వెధవది, మనిషి మూలుగే ఎంత దుస్సహంగా ఉంటుందా, ఇక డబ్బు – అందులోనూ, పాతిక లక్షలు – మూలుగుతుంటే మతో పోతుంది. బర్మాలో దిగబడిపోయిన ముప్ఫై లక్షలు మావాణ్ని బాధించలేదు. ఉన్న డబ్బుతోనే చావు!

ఏం చేద్దామన్నా యుద్ధమైపోయింది. అంటే యుద్ధం చెడ్డదనికాదు; యుద్ధం మూలంగా ప్రతిదానికీ కంట్రోలూ, పర్మిట్లూ, ప్రయారిటీలూ, బుకింగులూ, లేకపోవటాలూ, వల్లకాడూ, వశినకాడూ అయిపోయె.

మావాడు ఇప్పుడు అర్జంటుగా ఏదో ఓ పదార్థం ఏదో ఓ పరాయి దేశానికి ఎగుమతి చెయ్యాలి. ఏదైనా సరే, ఏదైనా సరే! పత్తిగింజలో, చింతపిక్కలో, సున్నపురాళ్లో, బలపాలో, తుప్పుపట్టిన ఇనపచెత్తో – ఏదైనాసరే ఎక్కడ దొరుకుతుందో, ఎవరు కొంటారో, ఎంతకు దొరుకుతుందో, ఎంతక్కొంటారో కనుక్కుంటే తనొకలక్ష చేసుకుని, నాక్కూడా – వెధవది, డబ్బేగా! ఓ వెయ్యి పారేస్తానంటాడు మా గిర్ధర్‌భాయ్.

నాకు తిక్కెత్తుకొచ్చింది. చివరికి వాణ్ని నాలుగు తిట్టి వాడికి దేశీయ ఆర్థిక పరిస్థితి మీద చిన్న ఉపన్యాసం ఇచ్చాను.

"ఎంతసేపటికీ వ్యాపారమో, వ్యాపారమో అని ఏడుస్తావు. నీ వ్యాపారమే మనదేశాన్ని ఈ స్థితికి తెచ్చింది. పాశ్చాత్యులు వ్యాపారం చేస్తున్నారంటే వాళ్లకి పరిశ్రమలున్నై. చిత్తం వచ్చిన ధరలకి వస్తువులమ్ముకునేందుకు దిక్కుమాలిన బానిస దేశాలున్నై. నీకేముంది? నువు పదార్థాలే వాళ్లు వస్తువులు చేసి పంపిస్తే మళ్లీ దిగుమతి చేసి లాభం తీస్తావు. రెండందాలా దేశాన్ని దోస్తున్నావు. ఎందుకు నీ దిక్కుమాలిన వ్యాపారం. చాతయితే పరిశ్రమలు సాగించు. ముడిపదార్థాలు పైకి పోనివ్వకు. వాటిని సంపదగా మార్చి పైవాళ్లు తీసుకునే లాభం కూడా నువే తీసుకో. ఆ పని చెయ్యగలిగితే నాతో మాట్లాడు" అన్నాను.

"నే కాదన్నానా? నా డబ్బంతా తీసుకుని నువు ఏదన్నా పరిశ్రమ నడుపు" అన్నాడు గిర్ధర్‌భాయ్.

"ఏం పరిశ్రమ నడపమన్నావ్?" అన్నాను.

"నీ యిష్టం! నేనే మీ కాదన్ను."

నేను మొదట్లో మా వాడి మాట నమ్మలేక పోయినాను. కాని వాడు నన్ను రోజూ తినసాగాడు – పరిశ్రమ ఏమయిందని! వాడి పోరుపడలేక అమ్ముడు పొయ్యే ఫ్యాక్టరీలేమైనా ఉన్నయ్యా అని ఆరా తియ్యసాగాను.

ఉంది – ఓ దొమ్మరగూడెం మధ్య ఓ పెద్దమనిషి ఓ చిన్న ఫ్యాక్టరీ నడుపుతున్నాడు. ఓ కొలిమి ఉంది. అందులో ఇత్తడి కరిగించి కడ్డీలు పోతపోసి పక్కన ఓ చిన్న మోటారు సహాయంతో తీగ లాగుతున్నారు. జాగా గలీజుగా ఉంది. కొలిమి మీద రెండు సీసారేకులు కప్పి ఉన్నై. మిగతాదంతా బట్టబయలే. ఎక్కడ చూసినా బొగ్గులూ, బూడిదా, ఇసకా!

"ఇది మనకు బాగా లేదు. ఊరికే ఇచ్చినా దండగేనేమో!" అన్నాను.

"అట్లా అనకు. దీన్ని మనకి ముప్పైవేలకమ్మటానికి సిద్ధంగా ఉన్నాడు – నేనంతా లెక్కలు కట్టాను. నెలకు దీనిమీద వెయ్యిరూపాలు నికరంగా లాభం వస్తుంది. ఇప్పుడిక్కడ కూలీలు లేరు. మనం మరో నలుగురు కూలీలని పెడితే వారానికి వెయ్యి హీనంగా వస్తుంది" అన్నాడు గిర్ధర్‌భాయి.

"ఇప్పుడు ఫ్యాక్టరీ కలవాడికి కూలీలు దొరకకనా అమ్ముతున్నాడు... ఈ వెధవ ఫ్యాక్టరీకి ముప్పైవేలేమిటి? చాల్లే పద," అన్నాను.

"ఇత్తడి తీగే, పౌను నాలుగు రూపాయలు అమ్ముతున్నది. నామాట విను. యాభై వేలైనా పారెయ్యటానికి నేనున్నగా?" అన్నాడు గిర్ధర్‌భాయి.

మొత్తానికి మావాడికా ఫ్యాక్టరీ కొన్నదాకా తోచలేదు. కొన్నవాడు అంతటితో తృప్తి పడక పదిమంది కూలీలని పెట్టాడు. నెలకు రెండొందలిచ్చి ఓ మెటలర్జిస్టును

తెచ్చాడు. నాక్కూడా ఓ మూడొందలని జీతం ఏర్పాటు చేసి అక్కడే కూచోన్నాడు. నేను చేసేది ఏమీలేదు.

మా మెటలర్జిస్టు కూడా మాకు తగ్గవాడే. ఈ విధంగా ఇత్తడి తీగ తియ్యటం అన్నిటికన్నా తుచ్ఛమైన పని అనేవాడు.

అయితే మన కదికూడా సరిగా చాతకాకుండా ఉందేం, అనేవాణ్ని.

బాగుందే? లాబొరేటరీ ఏది, పైరామీటర్లేవి? ఎలెక్ట్రిక్ ఫర్నేసులేవి, చిక్ కాస్టింగ్ పరికరాలేవి? అనేవాడు.

ఏమో అనేవాణ్ని.

ఇంకేం అనేవాడు. తనకవకాశం ఇస్తే రాగి తెచ్చి దాన్ని పుతం పెడతాననేవాడు. నేను నిరుత్సాహపరిచేవాణ్ని. చేస్తే రకరకాల కంచులు చెయ్యాలనేవాడు.

అవుననేవాణ్ని.

కాని ఇత్తడి తీగ మాత్రం కనిపించేదికాదు. బొత్తిగా కనిపించలేదని కాదు. మూడొందల పౌనులు తీగె తయారయింది - మొదటి ముప్ఫై రోజుల్లోనూ, అదన్నా అమ్మి డబ్బు కళ్లజూతామంటే మా గిర్థర్‌భాయి, వొద్దు దాంతో పని ఉందన్నాడు.

నాకెందుకని ఊరుకున్నాను నాకికి ఏ విచారమూ లేదు. ఎప్పుడో మావాడు వచ్చి నా ఎదటపడి కంటతడి పెట్టకపోడు - ఇంత డబ్బూ వృథాగా పారబోశామే అని! అప్పుడు వాణ్ని ఎట్లా సముదాయిద్దామా అనే సమస్య ఒకటే నన్ను బాధిస్తున్నది. కాని మావాడి ఉత్సాహమూ వాడు తీరని పనిమీద తిరిగే తిరుగుడూ చూస్తే ఇప్పట్లో జ్ఞానోదయమయే లక్షణాలు కనిపించలేదు.

నా నెల జీతం నాకు సక్రమంగానే ముట్టింది. నాకు తెలీకుండా కొంతతీగ అమ్మాడేమో అని అనుమానం కలిగిందిగాని అదేమీ జరగలేదు. తీగ తీగలాగే ఉంది.

నా చేతిమీదిగానే మా మెటలర్జిస్టుకూ కూలీలకూ కూడా జీతాలు ముట్టినై.

నేనాశ్చర్య పడ్డానుగాని పైనేమీ అనలేదు.

ఇంతలో మా ఫ్యాక్టరీ చూడటానికి ఎవరెవరో గుజరాదీ సేటులు రాసాగారు. వాళ్లు మా తీగ చూస్తారేమో అని నాకు సిగ్గేసింది. కాని అవసరంగా బాధపడ్డాను. మా గిర్థర్‌భాయి వాళ్లకా తీగే చూపించాడు. కొలిమికూడా చూపించాడు. బొగ్గులూ, బూడిదా, ఇసకా కూడా చూపించాడు. ఆఖరికి గారడీ వాడల్లే మా మెటలర్జిస్టునూ కూలీలనీ చూపించాడు. సేటులు వాళ్ల భాషలో "బద్దూసారూఖే... కమోనధీ" అని ఏమిటో చెప్పుకున్నారు.

మావాడు వాళ్లతో వారానికి వెయ్యిరూపాయలు లాభం వస్తుందని చెబుతున్నట్టు అనుమానం వేసింది. వాడికింకా అదే భ్రమ ఉండటం చూసి ఆశ్చర్యం కూడా వేసింది.

అయితే చిత్రం ఏమిటంటే ఆ గుజరాతీలు మరో వారం రోజుల్లో మా ఫ్యాక్టరీ అరవై వేలక్కొన్నట్టు తెలిసింది?

"నిజమేనా?" అన్నాను గిర్ధర్‌భాయితో.

"పొరపాటు చేశాను. అమ్మకుండా ఉండాలిసింది. మనకి చాలా లాభం రాబోతుండగా అమ్మేశాం. వాళ్లు లక్షలు గడిస్తారు.. నిన్ను ఏదన్నా మంచి పరిశ్రమ చూడమంటే చూడకనే పోతివి!" అన్నాడు.

"ఫ్యాక్టరీ ఎందుకమ్మావ్? నీ బుద్ధికి కొనటం అమ్మటం తప్ప ఇంకోటి తట్టదేం?" అన్నాను.

"ఆ వెధవ ఫ్యాక్టరీ మనకెందుకు? మనం పెద్దది పెడదాం. పాతికలక్షలు మూలుగుతున్నై. చూడుమరి" అన్నాడు.

"ఏం చూడమన్నావ్? మళ్లా అదీ అమ్ముతావ్?"

"అమ్మితే నీకేం? మళ్లా ఇంకోటి కొంటే సరిగా?" అన్నాడు మా పారిశ్రామికుడు.

***ముద్రణ : రూపవాణి, ఫిబ్రవరి 1945***